సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



ఘనంగా చండీహోమం

పెనుగొండ: మాఘ పౌర్ణమి సందర్భంగా పెనుగొండలోని వాసవీ శాంతి థాం, మూలవిరాట్ వాసవీ ఆలయాల్లో చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



శ్రీవారి సేవలో మంత్రి వనిత

ద్వారకాతిరుమల: చిన వెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: చిన వెంకన్న నిత్యాన్న దాన ట్రస్టుకు నిడదవోలుకు చెందిన పాలి బాల మురళీకృష్ణ రూ.1,11,000లను విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

గ్రూప్-2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



ఎస్.రామసుందర్ రెడ్డి, జేసీ

భీమవరం: జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించే ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 14,546 మంది అభ్యర్థుల కోసం 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 17 మంది రూట్ ఆఫీసర్లు, 37 మంది లైజన్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఉదయం 10.30 గంటల ప్రారంభమయ్యే పరీక్షకు అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, పుస్తకాలకు అనుమతి లేదన్నారు. హాల్‌టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు.

అట్రాసిటీ బాధితులకు న్యాయం



మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేస్తామని తాడేపల్లిగూడెం ఆర్డీఓ కె.చెన్నయ్య అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డివిజనల్ స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు, డివిజన్‌లోని తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ చెన్నయ్య మాట్లాడుతూ బాధితులకు స్వాంతన చేకూర్చేలా కమిటీలో సభ్యులు, అధికారులు కృషి చేయాలన్నారు. డీఎస్పీ మూర్తి మాట్లాడుతూ అట్రాసిటీ కేసులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ బాధితులకు నిజాయితీగా న్యాయం చేయాలని కోరారు. తప్పుడు కేసులను ప్రోత్సహించరాదన్నారు. ఎంపీపీ పానుకుమాటి శేషులత, ఏఎస్‌డబ్ల్యూఓలు కె.రామాంజనేయులు, పి.నాగసాయమ్మ, కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు, తెన్నేటి జగజ్జీవన్, రొక్కాల నాగబుజ్జి, సింగం త్రిమూర్తులు, తహసీల్దార్ వి.మురళీకృష్ణ, ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 52 కేంద్రాలు

భీమవరం: జిల్లాలో వచ్చేనెల 1 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ పరీక్షలకు 52 కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు ఆర్ఐఓ కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక సీఎస్ఎన్ కళాశాలలో పరీక్షలు జరిగే కళాశాలల అధ్యాపకులు, పర్యవేక్షకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంటర్ ఫస్టియర్ 17,806 మంది, సెకండియర్ 18,143 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. మార్చి 20 వరకు నిర్వహించే పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని, 8.30 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా హాల్‌లోకి అనుమతిస్తామన్నారు. విద్యార్థులతోపాటు కేంద్రంలోని పర్యవేక్షకులకు కూడా సెల్‌ఫోన్లు తీసుకురాకూడదన్నారు. సమావేశంలో పరీక్షల నిర్వహణ విభాగం సభ్యులు ఎం.నర్సింహమూర్తి, వి.శ్రీనివాసరావు, ఎ.నాగేశ్వరరావు, వి.రాజ్‌కృష్ణ పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందని జిల్లా స్వీప్ నోడల్ అధికారి జీసీహెచ్ ప్రభాకర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేయడమంటే దేశభక్తిని చాటుకోవడమేనన్నారు. 96 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఈవీఎంలపై నమ్మకాన్ని మరింత పెంచేలా కేంద్ర ప్రభుత్వం వీవీప్యాట్‌లను అందుబాటులోకి తెచ్చిందన్నారు. జిల్లా ఎలక్ట్రోరల్ అధికారి సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి నిమిత్తం గ్రామాంతరాలు వెళ్లిన వారితో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్లకు మొండిచేయి



- చింతమనేని, గన్ని టికెట్లు పెండింగ్
- జిల్లాలో సీట్ల ప్రకటనలో బోణీ కొట్టని జనసేన
- పవన్ కళ్యాణ్ సీటుపై స్పష్టత కరువు
- ఉండి, తణుకులో అసంతృప్తికి ఆజ్యం
- నూజివీడులో జంపింగ్ నేతకు టికెట్
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు సీట్లు ప్రకటించిన టీడీపీ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: తెలుగుదేశం ప్రకటించిన తొలి జాబితాలో సీనియర్లకు మొండిచేయి చూపారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నేతలను పూర్తిగా పక్కకు తప్పించగా ఇన్‌చార్జిలు, కీలక నేతలుగా చెలామణి అవుతున్న వారి టికెట్లను కూడా పెండింగ్‌లో పెట్టి గట్టి షాక్ ఇచ్చారు. ఇక జనసేనకు సంబంధించి ఉమ్మడి పశ్చిమగోదావరిలో పవన్ కళ్యాణ్ సీటు సహా ఒక్క స్థానాన్ని కూడా ప్రకటించుకోలేని పరిస్థితి. మొత్తంగా నూతన ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 14 నియోజకవర్గాల్లో 7 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను ప్రకటించింది. తణుకులో జనసేన ఇన్‌చార్జి, ఉండిలో టీడీపీ మాజీ ఎమ్మెల్యేల అసమ్మతి తారాస్థాయికి చేరింది. రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించే దిశగా ఈ ఇద్దరు నేతలు సమాలోచనల్లో ఉన్నారు.

పొత్తులు తేలక అయోమయం

టీడీపీ పాలకొల్లు, ఉండి సిట్టింగ్ ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, తణుకు ఇన్‌చార్జి ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏలూరు సిటీ ఇన్‌చార్జి బడేటి రాధాకృష్ణ (చంటి), చింతలపూడి ఇన్‌చార్జి సొంగా రోషన్, నూజివీడు ఇన్‌చార్జి కొలుసు పార్థసారథి, ఆచంట ఇన్‌చార్జి పితాని సత్యనారాయణను అభ్యర్థులుగా ప్రకటించింది. మిగిలిన ఏడు నియోజకవర్గాల్లో పొత్తులు తేలక అభ్యర్థిత్వాలపై పలు సందేహాలు, ఇతర కారణాలతో పెండింగ్‌లో పెట్టడం జిల్లాలో కాక రేపుతోంది.

చింతమనేని, గన్నికి సీట్లు దక్కేనా..!

ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఉంగుటూరు ఇన్‌చార్జి గన్ని వీరాంజనేయులు భవితవ్యం పెండింగ్‌లో పడింది. దెందులూరు ఇన్‌చార్జి చింతమనేని ప్రభాకర్ టికెట్ కూడా పెండింగ్‌లో ఉండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మేమే టీడీపీ.. మాదే టీడీపీ అంటూ జిల్లాలో అడ్డగోలుగా వ్యవహరించే ఇద్దరు నేతలకు తొలి జాబితాలో టికెట్ రాకపోవడం కేడర్‌లో అనుమానాలను రేకెత్తిస్తోంది. ఉంగుటూరు అభ్యర్థికి టికెట్ దక్కదని, జనసేనకు టికెట్ ఖరారయ్యే అవకాశం ఉందని రెండు పార్టీల్లోనూ బలంగా ప్రచారం సాగుతోంది. ఇక చింతమనేని ప్రభాకర్‌కు ఈ ఏడాది ఒక కేసులో రెండేళ్ల జైలు శిక్ష విధించారు. దానిపై ప్రస్తుతం ఆయన స్టే తీసుకున్నారు. 2011 నవంబర్ 26న దెందులూరు జెడ్పీ స్కూల్లో అప్పటి మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై దాడి చేశారనే ఉదంతంపై నమోదైన కేసుకు సంబంధించి భీమడోలు కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. దీనిపై చింతమనేని జిల్లా కోర్టుకు అప్పీలుకు వెళ్లి స్టే తీసుకున్నారు. ఈ కారణంతో పెండింగ్ పెట్టారని ఒక వర్గం, నియోజకవర్గంలో చంద్రబాబు సామాజికవర్గ నేతలు చింతమనేనిని మార్చాలని గట్టిగా డిమాండ్ చేసిన నేపథ్యంలో పునరాలోచన నడుస్తోందని పార్టీలోని మరో వర్గం నేతలు చెబుతున్నారు.


సుజాతను తప్పించి.. ముద్దరబోయినకు ముంచేసి..

పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలుగా మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మికి గతంలోనే టికెట్ లేదని స్పష్టత ఇచ్చారు. కనీసం ఏదో ఒక నియోజకవర్గానికి ఆమె పేరును పరిశీలించకపోవడం గమనార్హం. ఇక చింతలపూడి, ఆచంటలో గెలుపొందిన మాజీ మంత్రి పీతల సుజాతను 2019 నుంచే పక్కన పెట్టారు. 2024లో కూడా టికెట్ ఇవ్వకుండా పూర్తిగా తప్పించి ఆమె స్థానంలో ఎన్ఆర్ఐ సొంగా రోషన్ కుమార్‌కు చింతలపూడి అసెంబ్లీ టికెట్ కేటాయించారు. ఇక నూజివీడు నియోజకవర్గంలో రెండు సార్లు ఓడిపోయినా పదేళ్లుగా పార్టీ జెండా మోసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు హ్యాండ్ ఇచ్చి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయిన కొలుసు పార్థసారథిని అభ్యర్థిగా ప్రకటించారు. ఈయన ఇప్పటివరకు టీడీపీలో చేరకపోయినా టికెట్ దక్కడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

పవన్ కళ్యాణ్‌కే దిక్కులేదు

జనసేన తొలి జాబితాలో పవన్ కళ్యాణ్ పేరు లేదు. భీమవరంలో గెలుపుపై అనుమానాలు ఉండటంతో పెండింగ్‌లో పెట్టారు. అలాగే పవన్ కళ్యాణ్‌పై పూర్తి ఆశలు పెట్టుకున్న తణుకు జనసేన ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావుకు హ్యాండ్ ఇచ్చారు. ఇటీవల తణుకు సమావేశంలో పొత్తుల్లో ఉన్నా సరే విడివాడ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉంటారంటూ కేడర్‌కు స్పష్టంగా చెప్పిన పవన్.. చివరికి హ్యాండిచ్చారు. ఆరిమిల్లిని టీడీపీ తమ అభ్యర్థిగా ప్రకటించడంతో విడివాడ అసంతృప్తికి గురై కేడర్‌కు అందుబాటులో లేకుండా ఇంట్లోనే ఉండిపోయారు. ఇక ఉండిలో మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు టీడీపీ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించి భంగపడ్డారు. దీంతో ఆదివారం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పి అంతర్వేది వెళ్లిపోయారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఏలూరులో 'అన్న వచ్చే.. ఆశ తెచ్చే' అంటూ ఫ్లెక్సీలతో నానా హడావుడి చేసిన జనసేన నేత నారా శేషు, జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన రెడ్డి అప్పలనాయుడుకు మళ్లీ అవకాశం ఇస్తామని చెప్పి హ్యాండివ్వడంతో వీరిద్దరూ షాక్‌లో ఉన్నారు.

భీమవరంలో బిక్కముఖమేనా?



- తొలి జాబితాలో పేరు ప్రకటించుకోని పవన్ కళ్యాణ్
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ పునరాలోచనలో జనసేనాని
- ఇప్పటివరకూ ఇక్కడి నుంచే పోటీ చేస్తారని ప్రచారం
- ఇటీవలే టీడీపీ నేతలను కలిసి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం
- టీడీపీ, జనసేన అంతర్గత విభేదాలతో పవన్ వెనుకడుగు
- తీవ్ర నైరాశ్యంలో జనసేన కేడర్

సాక్షి, భీమవరం: జనసేనాని పవన్ కళ్యాణ్ భీమవరం బరిలోకి దిగేందుకు జంకుతున్నారా? గతంలో మాదిరి ఓటమి పాలైతే ఇక రాజకీయ భవిష్యత్ శూన్యమేనా? పోటీ చేసే విషయంలో పునరాలోచనలో పడ్డారా? మిత్రపక్షం టీడీపీ, తన కేడర్ మధ్య కుమ్ములాటలు, మరోపక్క ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ 'లోకల్' చరిష్మా తనకు చేటు చేస్తాయని భావిస్తున్నారా? అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. ఇటీవల భీమవరంలో టీడీపీ, బీజేపీ నేతలను కలిసి వారి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేయడంతో పవన్ ఇక్కడి నుంచే పోటీ చేస్తారన్న ప్రచారానికి బలం చేకూరింది. అయితే తాజాగా విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో తన పేరు ప్రకటించుకోకపోవడంతో ఆ పార్టీ కేడర్ పూర్తి నైరాశ్యంలో పడిపోయింది.

గత ఎన్నికల్లో ఘోర ఓటమి

2019 ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా భీమవరం నుంచి పవన్ కళ్యాణ్ పోటీలో నిలిచారు. జననేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనం, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ లోకల్ బలం ముందు పవన్‌కు ఘోర పరాజయం తప్పలేదు. 8,500 పైగా ఓట్లతో ఆయన పరాజయాన్ని చవిచూశారు. ఎన్నికల సమయంలో భీమవరంలో మకాం ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చినా ఎన్నికల అనంతరం గత ఐదేళ్లలో రెండు, మూడుసార్లు తప్ప భీమవరం ప్రజలకు ఆయన దర్శన భాగ్యం కలగలేదు. దీంతో పార్టీ కేడర్ తీవ్ర అసంతృప్తిగా ఉంది. కొద్దినెలల క్రితం పవన్ భీమవరం వచ్చిన సందర్భంగా సొంత పార్టీ నేతలకే ఆయన్ని కలిసే అవకాశం దక్కలేదు. 'పార్టీ కోసం లక్షలు ఖర్చుపెడుతున్న తమకే అధినేతను కలిసే భాగ్యం కలగలేదు. ఇంకా మీకెక్కడ' అంటూ కొందరు నేతలను ఉద్దేశించి జనసేన పార్టీ వీరవాసరం జెడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్‌నాయుడు చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెను దుమారమే రేపాయి.

మద్దతు కోసం కలిసి.. మౌనంగా మారి..

రానున్న ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ భీమవరం నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం కొద్దిరోజులుగా సాగుతోంది. టీడీపీలో గ్రూపు విభేదాలను చక్కదిద్ది వారి మద్దతు కూడగట్టుకునేందుకు రెండు రోజుల క్రితం భీమవరం పర్యటనకు ఆయన విచ్చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, బీజేపీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ పాకా సత్యనారాయణ నివాసాలకు వెళ్లి స్వయంగా వారిని కలిసి మద్దతు కూడగట్టుకోవడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా భీమవరం నుంచి పోటీ చేస్తున్నట్టు పవన్ ప్రకటించకపోయినా ఇక లాంఛనమే అని పార్టీ కేడర్ భావించింది. స్థానికంగా ఆయన ఉండేందుకు అనువైన ఇంటి కోసం ప్రయత్నిస్తున్నట్టు కూడా చర్చ జరిగింది.

ఐదేళ్ల అభివృద్ధి ఆందోళనతోనే..

శనివారం పవన్ విడుదల చేసిన జనసేన పార్టీ అభ్యర్థుల మొదటి జాబితాలో తాను పోటీ చేసే స్థానం ప్రకటించకపోవడం పార్టీ కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది. మిత్రపక్ష భాగస్వామి చంద్రబాబు కుప్పం నుంచి పోటీచేస్తున్నట్టు ప్రకటించగా భీమవరం నుంచి పోటీపై తమ అధినేత ఇంకా స్పష్టత ఇవ్వకపోవడంతో కేడర్ అసంతృప్తికి లోనవుతున్నారు. టీడీపీ, జనసేన పార్టీల్లో నాయకుల మధ్య సఖ్యత లేకపోవడం, గ్రూపు రాజకీయాలు తనకు చేటు చేస్తాయన్న ఆందోళనలో పవన్ ఉన్నట్టు తెలుస్తోంది. దీనికితోడు తనకు మంత్రి పదవి ఇవ్వకపోయినా జిల్లాల పునర్విభజన సందర్భంగా భీమవరాన్ని జిల్లా కేంద్రం చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కోరిన విషయాన్ని స్వయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల భీమవరంలో జరిగిన జగనన్న విద్యాదీవెన బహిరంగ సభ వేదికగా వెల్లడించడం ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు నియోజకవర్గంలో మరింత జనాదరణ పెంచింది. ఐదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీని ప్రజలకు మరింత చేరువ చేశాయి. ఆయా ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో 2019 ఎన్నికల ఫలితాలు పునరావృతమవుతాయన్న ఆందోళనతో భీమవరం నుంచి పోటీచేసే విషయమై పవన్ కళ్యాణ్ పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది.

నూరు శాతం పల్స్ పోలియోకు కృషి

జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): రెండు పోలియో చుక్కలు నిండు నూరేళ్ల రక్ష అని, పల్స్ పోలియోను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. వచ్చేనెల 3న జిల్లాలో జరిగే పల్స్ పోలియోపై కలెక్టరేట్‌లో శనివారం టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యంతోనే పోలియో నిర్మూలన సాధ్యమన్నారు. తొలిరోజు పోలియో చుక్కలు అందని పిల్లల కోసం 4, 5 తేదీల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 1,85,953 మంది ఉన్నారని, వీరి కోసం 1,315 పబ్లిక్ బూత్‌లు, 45 మొబైల్ బూత్‌లు, 34 ట్రాన్సిస్ట్ బూత్‌లను ఏర్పాటుచేశామన్నారు. 5,520 మంది వ్యాక్సినేటర్లను సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లాలో 181 రూట్లకు గాను ఒక్కొక్క వాహనాన్ని ఏర్పాటుచేశామన్నారు. గతేడాది 99.91 శాతం వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి చేశామని, ఈ ఏడాది నూరు శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆర్డీఓ కె.చెన్నయ్య, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, డీసీహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, ఇమ్యూనైజేషన్ అధికారి డి.సుధాలక్ష్మి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ ఎస్.కీర్తి కిరణ్ పాల్గొన్నారు.

● ఎస్సై.. శిక్షణకు సై

తమ కుమార్తె ఎస్సై ఉద్యోగానికి ఎంపికైందని ఓ తల్లి ఆనందం.. తన భర్త ఎస్సై శిక్షణకు వెళుతున్నాడని ఓ భార్య సంతోషం.. నాన్నను వదిలి ఉండలేక దిగులుతో వీడ్కోలు చెప్పిన ఓ చిన్నారి ముఖం.. ఇవి ఏలూరు డీఐజీ కార్యాలయం వద్ద కనిపించిన దృశ్యాలు. ఏలూరు రేంజ్‌లో ఎస్సై ఉద్యోగాలకు ఎంపికైన వారిని శిక్షణ నిమిత్తం ప్రత్యేక బస్సుల్లో శనివారం అనంతపురం పంపించారు. ఎస్సై అభ్యర్థుల కుటుంబసభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. - సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



అనంతపురం శిక్షణకు వెళుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్లు



మహిళా ఎస్సైల విజయ దరహాసం



బై.. బై.. అంటున్న కుటుంబ సభ్యులు

సేవ చేయడం అదృష్టం

ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్



ఎస్సైలకు సూచనలిస్తున్న ఐజీ అశోక్ కుమార్

ఏలూరు టౌన్: పోలీస్ ఉద్యోగమంటే ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేయడమేనని, పోలీస్ అధికారిగా నియమితులు కావడం అదృష్టంగా భావించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎస్సై నియామక ప్రక్రియలో భాగంగా ఏలూరు రేంజ్‌లోని జోన్-2 పరిధిలో 105 సివిల్ పోస్టులకు 103 మంది అర్హత సాధించారు. వీరిలో 93 మంది ఎస్సైలను అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో శిక్షణకు పంపారు. ఎంపికైన వారిలో 12 మంది కానిస్టేబుళ్లు ఉండగా 45 మంది బీటెక్ గ్రాడ్యుయేట్లు, 46 మంది సైన్స్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ కార్యాలయంలో శనివారం ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్ అధికారిగా ఉద్యోగం అరుదైన గౌరవంగా భావించి, ప్రతిఒక్కరూ శిక్షణా సమయంలో చట్టాలను ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన పెంచుకుని ప్రజలకు ఎలా న్యాయం చేయాలో నేర్చుకోవాలని సూచించారు. ఉన్నతాధికారుల నుంచి మెలకువలు, సూచనలు తెలుసుకుంటూ సక్రమమైన మార్గంలో ఉత్తమ అధికారులుగా బయటకు రావాలన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధిని చూసి ఓర్వలేకే దాడులు



కామవరపు కోట శివారు పాతూరు రోడ్డులో ధ్వంసం చేసిన శిలాఫలకం

కామవరపుకోట: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వ్యతిరేక శక్తులు దాడులు చేస్తున్నాయని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కడిమి రమేష్, మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం చైర్‌పర్సన్ కేసర సరితారెడ్డి విమర్శించారు. శనివారం వారు మాట్లాడుతూ ఎంపీ కోటగిరి శ్రీధర్ ఈనెల 21న రోడ్డు నిర్మాణానికి కామవరపుకోట శివారు పాతూరులో శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారన్నారు. ఈ శిలాఫలకాన్ని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగలు ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషులను పట్టుకుని శిక్షించాలని కోరారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో వివాహిత సజీవ దహనం

- గొల్లలకోడేరులో రేకుల షెడ్ ఇంటికి మంటలు
- పక్షవాతంతో మంచం నుంచి కదల్లేక దుర్మరణం



గొల్లలకోడేరు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన సామగ్రి



చేకూరి రమాదేవి (ఫైల్)

పాలకోడేరు: గొల్లలకోడేరులో ఓ రేకుల షెడ్‌లో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో పక్షవాతంతో మంచంపై కదల్లేని స్థితిలో ఉన్న ఓ వివాహిత సజీవదహనమైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఏఎస్‌ఆర్ నగర్‌లో చేకూరి వీర వెంకట శ్రీహరిరాజు భార్య రమాదేవి (45), కుమార్తె, కుమారుడితో రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారు. కుమార్తె ఉద్యోగం కోసం బెంగళూరుకు, కుమారుడు డిగ్రీ చదువుతూ ఇంటర్న్‌షిప్ కోసం హైదరాబాద్ వెళ్లారు. అత్తగారు పక్కనే ఉన్న ఇంట్లో ఉంటున్నారు. ఇదిలా ఉండగా, రమాదేవి కాలు పక్షవాతానికి గురై గత కొన్నేళ్లుగా మంచానికే పరిమితమైంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం శ్రీహరిరాజు పొలానికి వెళ్లగా, రమాదేవి ఒక్కరే ఇంట్లో ఉంది. ఆ సమయంలో ఇంటికి ఒక్కసారే నిప్పంటుకుని పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. రమాదేవి బయటకు వచ్చే వీలు లేకపోయింది. దీనికి తోడు ఇల్లు తలుపులు వేసి ఉండటంతో లోపలకు వెళ్లేదారి లేక ఆమెను రక్షించే అవకాశం లేకపోయింది. దీంతో రమాదేవి మంటల్లో చిక్కుకుని కాలి బూడిదైంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక అధికారి సిబ్బందితో కలిసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు చెప్పారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ కె.నాగార్జున, ఆర్‌ఐ ఎం.నాగభూషణం రాయుడు, వీఆర్వో ఇందిర, ఉండి ఏఎంసీ వైస్ చైర్మన్ చేకూరి నరేంద్రరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వినూత్న పరిశోధనలతోనే అందలం



ఏపి నిట్‌లో మాట్లాడుతున్న డాక్టర్ బి.చిట్టిబాబు

తాడేపల్లిగూడెం: విద్యార్థులు పరిశోధనలో వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.చిట్టిబాబు అన్నారు. ఏపీ నిట్‌లో పరిశోధనా పత్రాల సమర్పణ అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. అతిథిగా హాజరైన చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థుల, ఆచార్యుల పరిశోధనా కృషికి ప్రచురణలే కొలమానమన్నారు. వినూత్న ఆలోచనలతో ఆచరణాత్మకమైన ఆవిష్కరణలుగా తీర్చిదిద్దడానికి అవసరమైన తోడ్పాటును అందించేందుకు ఆచార్యులే మార్గదర్శిగా వ్యవహరిస్తారన్నారు. పరిశోధకులు ఏ విషయంపై శోధిస్తున్నారో ఆయా అంశానికి సంబంధించిన పుట్టుపూర్వోత్తరాలను లోతుగా విశ్లేషించడంతో పాటు కొత్తగా కనుగొన్న వాస్తవిక విషయాలను జోడించి పేపర్లను ప్రచురించాలన్నారు. నాణ్యమైన పరిశోధనా పత్రాలను ప్రచురిస్తే ఐఐటీ, ఎన్ఐటీ వంటి విద్యాసంస్థలతో పాటు కంపెనీల్లో సైతం ఉద్యోగాలను దక్కించుకోవచ్చన్నారు. విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలన్నారు. జర్నల్ పేపర్స్, కాన్ఫరెన్సు పేపర్ల మధ్య ఉన్న తేడాలను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ వి.సందీప్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రక్కు ఆటో బోల్తా.. 11 మందికి గాయాలు

ముసునూరు: గోపవరంలోని నాగేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి వెళుతున్న భక్తుల ట్రక్కు ఆటో బోల్తా పడి 11 మంది గాయాలయ్యాయి. ఎస్సై పి.వాసు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం వీరంపాలెంకు చెందిన భక్తులు శనివారం గోపవరంలోని నాగేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి బయలుదేరారు. కాట్రేనిపాడు-చిల్లబోయినపల్లి మార్గంలో వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆటో టైరు పేలడంతో అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో వాహనంలోని 11 మంది కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఏలూరు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్యవైశ్యులకు అండగా వైఎస్సార్ సీపీ



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్, చిత్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్యులకు అన్ని విషయాల్లో అధిక ప్రాధానమిచ్చిన సీఎం జగన్‌కి అండగా నిలవాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. ఆర్యవైశ్యుల వినతి మేరకు సీఎం జగన్ యధావిధిగా నవంబర్ 1నే రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుపుకునేలా చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వాసవీ అమ్మవారి ఆలయాలు, ట్రస్టులు, ఆస్తులను ఆర్యవైశ్య పాలక మండలికి అప్పగించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గత టీడీపీ హయాంలో టీటీడీ పాలక మండలిలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యమివ్వలేదని, సీఎం జగన్ మూడు పాలకవర్గాల్లో ముగ్గురు ఆర్యవైశ్యులకు చోటు కల్పించారన్నారు. రాష్ట్రంలోని 60 వేల మంది ఆర్యవైశ్య మహిళలకు ఈబీసీ నేస్తం కింద ఆర్థిక సాయం అందించారన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో వ్యాపార వర్గాలు అభివృద్ధి చెందాయన్నారు. టీడీపీ హయాంలో వ్యాపారులను ఇబ్బంది పెట్టారన్నారు. విదేశీ విద్య పథకంలో ఎక్కువ మంది ఆర్యవైశ్య యువకులు లబ్ధి పొందారన్నారు.

ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు: నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి మాట్లాడుతూ పాలకొల్లులో ఆర్యవైశ్యులు సేవామూర్తులుగా నిలిచారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వారికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చామన్నారు. ఆరు ట్రస్ట్‌బోర్డు పాలకవర్గాల్లో నాలుగుచోట్ల ఆర్యవైశ్యులను నియమించామన్నారు. వ్యాపారపరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. వాణిజ్య మండలి జిల్లా అధ్యక్షుడు బలభద్రుని బాలరెడ్డియ్య, జిల్లా కార్యదర్శి మానేపల్లి శేఖర్, ట్రస్ట్ బోర్డు చైర్మన్‌లు మామిడి వెంకటేశ్వరరావు (బాబు), నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ సన్నిశెట్టి లీలా భవన్నారాయణ, మాజీ ట్రస్టీ కంకటాల సతీష్, మాఘం బాలకొండలరావు పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు జనసేన మొండిచేయి



కుక్కల శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్ : జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించిన మొదటి జాబితాలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో శెట్టిబలిజ కులస్తులకు మొండిచేయి ఇచ్చారని శెట్టిబలిజ సంఘ జిల్లా అధ్యక్షుడు కుక్కల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో శెట్టిబలిజ కులస్తులు జనసేన పార్టీ నుంచి పోటీ చేసి ఆర్థికంగా, సామాజికంగా ఎంతో నష్టపోయారని శ్రీనివాస్ గుర్తు చేశారు. అయితే టీడీపీ, జనసేన సీట్ల సర్దుబాటులో శెట్టిబలిజ కులస్తులు పోటీ చేసిన స్థానాలను వేరే వర్గీయులకు కేటాయించడం సరికాదన్నారు. గత ఐదేళ్ల నుంచి అదే పార్టీలో ఉంటూ ఎన్నో అవమానాలకు, అనేక ఇబ్బందులకు గురవుతూ ఆర్థికంగా నష్టపోతూ వస్తున్న శెట్టిబలిజకు జనసేన అధినేత న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

షాపుల రిజిస్ట్రేషన్‌కు 29 వరకు గడువు

భీమవరం: జిల్లాలోని వాణిజ్య సంస్థలు, షాపుల యజమానులు ఈనెల 29లోపు తప్పనిసరిగా లేబర్ లైసెన్సులు రిజిస్ట్రేషన్స్ చేయించుకోవాలని కార్మిక శాఖ సహాయ కమిషనర్ పి.శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జ్ ఆఫీసర్ ఆకన లక్ష్మి శనివారం ప్రకటనలో తెలిపారు. సచివాలయాలు లేదా మీ సేవా కేంద్రాల్లో కార్మిక శాఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ పొందవచ్చని పేర్కొన్నారు. గడువులోపు రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలని వారు సూచించారు.

గూడెంలో అంతర్జాతీయ సదస్సు భేష్

తాడేపల్లిగూడెం: సామాజిక స్థిరమైన ఆవిష్కరణలపై గూడెం వంటి చిన్న పట్టణంలో అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందని శశి ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర అన్నారు. శనివారం కళాశాలలో జరిగిన ఐఈఈఈ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. ముఖ్యఅతిథిగా హాజరైన ట్రిపుల్ ఐటీ బెంగళూరు డైరెక్టర్ డిబబ్రతాదాస్ మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యను అభ్యసించాలన్నారు. నేతాజీ సుభాష్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రేరణగౌర్ మాట్లాడుతూ ఐఈఈఈ సదస్సు విశిష్టతను వివరించారు. రీసెర్చ్ విద్యార్థుల ప్రాజెక్టులను, పరిశోధనా పత్రాలను పరిశీలించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లు ఆకట్టుకున్నాయి. కాన్ఫరెన్సు జనరల్ చైర్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ కో-ఆర్డినేటర్ శివకుమార్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చైతన్యం రావాలి



కార్యక్రమానికి హాజరైన వద్ది రఘురాం తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అందరిలోను ఆధ్యాత్మిక చైతన్యం రావాలని బ్రహ్మకుమారీస్ రాజయోగ సంస్థ సేవా కేంద్రం నిర్వాహకురాలు బీకే రమాదేవి అన్నారు. శివ జయంతి మహోత్సవాల సందర్భంగా రాజయోగ శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం విశ్వశాంతి యాత్ర నిర్వహించారు. 150 మంది బ్రహ్మకుమారీలు ఐదు జిల్లాల నుంచి విచ్చేశారు. అనంతరం సేవా కేంద్రం 40వ వార్షికోత్సవం, శిక్షణా కేంద్రం భవనం రెండో అంతస్తు ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా అప్సడా వైస్ చైర్మన్ వద్ది రఘురాం నాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఈతకోట తాతాజీ, బీకే సబిత, బీకే శాంతి, బీకే సుధాకర్, బ్రహ్మకుమారీలు హాజరయ్యారు.

క్లుప్తంగా

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఆర్యవైశ్య సంఘం మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. మండలంలోని నీలాద్రిపురం గ్రామంలోని జీవీఎస్. ఫంక్షన్ హాల్‌లో ఈ ఎన్నిక జరిగింది. 2024–26వ సంవత్సరానికి గాను అధ్యక్షుడిగా కుసుమంచి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా బోనగిరి రమేష్, కోశాధికారిగా నున్న గంటారావు గుప్తాలను ఎన్నుకున్నారు. వీరితో ఆర్యవైశ్య సంఘం చిన్ని రామసత్యనారాయణ, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, జిల్లా కార్యదర్శి చిట్టూరి కాశీవిశ్వనాథంలు ప్రమాణ స్వీకరాం చేయించారు. ఆర్యవైశ్య సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వాసవిమాతకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వాసవి అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీటీసీ): వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో మాఘ మాసం పౌర్ణమి సందర్భంగా శనివారం వాసవి అమ్మవారి మూల విరాట్‌కు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలతో విశేషంగా అభిషేకాలు జరిగాయి. అమ్మవారిని రజిత చీరతో విశేషంగా అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ నున్న బాల త్రిపుర సుందరరావు, ఆలయ సెక్రటరీ ఆలపాటి సత్యనారాయణ, పూర్వ అధ్యక్షులు పేరూరి కాశయ్యలు పర్యవేక్షించారు.

నేడు రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ సమావేశం

తాడేపల్లిగూడెం (టీటీసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సమావేశం ఈ నెల 25వ తేదీన ఆదివారం సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న రోడ్డులోని గీతా మందిరంలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ తెలిపారు. సభ కార్యాక్రమాల్లో భాగంగా సినీ అనుకరణ నృత్యాలు, పౌరాణిక పద్యాలు ఆలపన, ట్రాక్ సంగీత విభావరి ఉంటాయని, గౌరవ, కళా, ఉద్యోగ, ఆర్థిక సత్కారాలు చేస్తామని, పట్టణ ప్రముకులు, కళాకారులు ప్రజలు హాజరుకావాలని కోరారు.

నేడు జీవన విద్యపై వర్క్‌షాప్

తణుకు టౌన్: తణుకు రామకృష్ణ సేవాసమితి భవన్‌లో ఈనెల 25వ తేదీన జీవన విద్యపై ఒక రోజు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కె గిరీశ్వరరావు తెలిపారు. ఆదివారం తణుకులోని రామకృష్ణ సేవా సమితి భవన్‌లో సెంటర్ ఫర్ హోలిస్టిక్ డవలప్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ కాన్షియస్‌నెస్, వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్స్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈకార్యక్రమంలో నిత్య జీవితంలో ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారాలు చూపే విధంగా వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈవర్క్ షాప్ ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భారీ అన్నసమారాధన



రేలంగిలో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ ముగింపు మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ అన్న సమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి లింగంపల్లి లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తత అవసరం



బస్టాండ్ ఏరియాలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కేవైఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రవికిరణ్ సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడేనికి చెందిన మిరియాల రవిబాబు బృందం శనివారం మండలంలోని ఉల్లంపర్రు, పాలకొల్లు బస్టాండ్ ఏరియాల్లో వీధి నాటికలు ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఐసీటీసీ సెంటర్ల ఆవశ్యకత, ఏఆర్టీ మందుల ప్రాధాన్యత, హెచ్ఐవీ టోల్ ఫ్రీ నంబర్ 1097 పై అవగాహన కల్పించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం

- సంక్షేమం, అభివృద్ధి రావాలంటే సీఎంగా జగనే రావాలి
- తణుకు నియోజకవర్గ సంక్షేమం, అభివృద్ధికి రూ. 3,300కోట్లు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



యాదవ సంఘ కమ్యూనిటీ హాల్ వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి



తణుకు ఎన్జీవో కాలనీలో సీసీ రోడ్డును ప్రారంభించిన మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతరం వచ్చిందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల పూర్తిచేసిన సీసీరోడ్లు, ఎస్సీ, యాదవ సంఘ కమ్యూనిటీ హాల్స్, డ్రెయినేజీల అభివృద్ధి పనులను శనివారం మంత్రి కారుమూరి ప్రారంభించి మాట్లాడారు. కులం, మతం, ప్రాంత బేధాల్లేకుండా అందరికీ సంక్షేమం, అన్ని ప్రాంతాల్లోను అభివృద్ధి జరగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకోవాలన్నారు. తణుకు నియోజవర్గాన్ని గతంలో తానే అభివృద్ధి చేశానని, ఇప్పుడు మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్ఫూర్తితో అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు స్పష్టం చేశారు. 14వ వార్షిక నిధులు, గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిధులు కలిపి సుమారుగా రూ. 3 కోట్ల పనులను ప్రారంభించామని, నియోజకవర్గంలో తమ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇప్పటి వరకు రూ. 3300 కోట్లుతో సంక్షేమ, అభివృద్ధి అందించిన ఘనత మాకే దక్కుతుందని అన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజాసౌకర్యార్థం ఖర్చుచేసిన ప్రతి రూపాయికి లెక్క ఉందని, వివిధ పథకాల రూపంలో అంతా పారదర్శకంగానే మహిళల బ్యాంకు ఖాతాలకే చేరిందని అన్నారు. ముఖ్యంగా ఇరగవరం రోడ్డులో రూ. 75 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మాణం చేసి ప్రారంభించామని, ప్రస్తుతం పైఅంతస్థు భవనం కూడా నిర్మాణంలో ఉందని రూ. 2కోట్లు మున్సిపల్ నిధులు వెచ్చించినట్లు చెప్పారు. రూ. 75 లక్షల మున్సిపల్ నిధులతో యాదవ సంఘ కమ్యూనిటీ హాల్‌ను కూడా ప్రారంభించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి జరుగుతుందనే విషయాన్ని ప్రజలంతా గుర్తుంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైస్‌చైర్మన్ మారిశెట్టి శివశంకర్, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, సప్పా బలరామకృష్ణ, డీజే అమూల్యారావు, కొత్తపల్లి రామచంద్రరావు, గెద్దాడ శ్రీకాంత్, సామంతుల అప్పారావు, గుబ్బల సూర్యచంద్రరావు, గారపాటి సత్యనారాయణ, పొట్ల సురేష్, కుడుపూడి చంద్రరావు, బొల్లాడ శ్రీనివాస్, వై.రామకృష్ణ, యడ్లపల్లి సురేంద్ర, ఎస్వీ జాకబ్‌బాబు, కర్రి గంగాధర అప్పారావు, పొడుగు రామాచారి, వన్నెంరెడ్డి మురళీకృష్ణ, షేక్ సలీం, గోడి నాగబాబు, షేక్ బాజీ, దోలా సింహాద్రి పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితులకు అండగా ఉంటాం



వినతి పత్రంతో బాధిత కుటుంబ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): గల్ఫ్ బాధితులకు అండగా ఉంటామని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు తెలిపారు. ఇండియా నుంచి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ ఇబ్బందులు పడుతున్న వారిని భారత్‌కు తీసుకురావాలని పలువురు శనివారం తాడేపల్లిగూడెం గల్ఫ్‌హెల్ఫ్ కార్యాలయంలో విజ్ఞప్తి చేశారు. పెనుమంట్ర మండలం వెలగలేరు గ్రామానికి చెందిన పోలుపర్తి సత్యనారాయణ ఉపాధి నిమిత్తం కువైట్‌కి వెళ్లి మతిస్థిమితం కోల్పోయారని తెలిపారు. ఆయన్ని మన దేశానికి రాకుండా సంబంధిత కంపెనీ అనుమతలు ఇవ్వడం లేని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గట్టిం మాట్లాడుతూ భారత్, కువైట్, మస్కట్ దేశాలకు చెందిన రాయబారి కార్యాలయం అధికారులతో మాట్లాడి బాధితులను ఇండియాకు రప్పిస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వెంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



దివ్య కల్యాణాన్ని చూసేందుకు వచ్చిన భక్తులు

తాడేపల్లిగూడెం అర్బన్: దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో ధర్మ ప్రచార ప్రరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార మహోత్సవాల్లో భాగంగా బలుసులమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద శనివారం రాత్రి 7గంటలకు వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కల్యాణంలో ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, సౌదామిని దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు విశేషంగా హాజరై కల్యాణాన్ని తిలకించారు. పట్టణంలో శ్రీవారి కల్యాణం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కల్యాణం అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమాలను ఆయా దేవస్థానాల నిర్వహణ అధికారులు, సిబ్బంది తోపాటు శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం ఈఓ రవిశంకర్, ఆలయ చైర్మన్ కొట్టు అంజిబాబు, గార్లపాటి వీరబాబు, వట్టిప్రోలు రాము, అప్పన రమేష్‌కుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గంగా కక్షిదారులు భావించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి, న్యాయమూర్తులు

తణుకు అర్బన్: రాజీ మార్గమే రాజమార్గంగా కక్షిదారులు భావించి తమ కేసులను రాజీ పరచుకుని తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి సూచించారు. తణుకు కోర్టులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చేనెల 9వ తేదీన తణుకు కోర్టు ప్రాంగణంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కక్షిదారులకు రాజీ కాదగ్గ కేసులన్నింటినీ త్వరితగతిన పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ వేదికగా నిలుస్తుందన్నారు. సివిల్, ప్రీలిటిగేషన్, బ్యాంకు కేసులతో పాటు రాజీకాదగ్గ క్రిమినల్ కేసులను అధికశాతం రాజీ చేసేందుకు ప్రయత్నించాలని ఇప్పటికే పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశాలు నిర్వహించామని స్పష్టం చేశారు. కక్షిదారులు ఏలూరులోని శాశ్వత లోక్ అదాలత్‌లో మధ్యవర్తిత్వం ద్వారా కూడా తమ కేసులను పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పీవీ నాగరాజు, స్పెషల్ మేజిస్ట్రేట్ పీసీహెచ్ ఎస్ చిరంజీవిరావు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరి పరామర్శలు



వేల్పూరులో గోపాలం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పరామర్శించారు. తణుకు మండలం వేల్పూరు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్ తండ్రి నున్న గోపాలం ఇటీవల మృతి చెందారు. అలాగే వేల్పూరు గ్రామానికి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఐశెట్టి శేషకుమారి తల్లి కర్రెళ్ల భవానీ ఇటీవల మృతి చెందారు. శనివారం మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వేల్పూరులోని వారి నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నున్న గోపాలం చిత్రపటానికి, కర్రెళ్ల భవానీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు,సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు చుంద్రు శ్యామల, విజయ దుర్గ, పంచాయతీ సభ్యులు సుబ్రహ్మణ్యం ,పార్టీ నాయకులు పాల్గొన్నారు. పైడిపర్రులోని ఇటీవల మృతి చెందిన గనివీటి రాము కుటుంబ సభ్యలను మంత్రి కారుమూరి పరామర్శించారు.

నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడిగా సురేంద్ర



సురేంద్రను అభినందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ తణుకు నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడిగా యడ్లపల్లి సురేంద్రను నియమిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో శనివారం నిర్వహించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో భాగంగా మంత్రి కారుమూరి సురేంద్రకు ఈ పదవి అప్పగించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ పార్టీకి కట్టుబడి పనిచేస్తానని, నియోజకవర్గంలోని పార్టీ పెద్దల సహకారంతో యువతను చైతన్యపరచి పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, సప్పా బలరామకృష్ణ పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చనలు చేసి, స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

కెమికల్ డ్రమ్ము పేలి ఒకరికి తీవ్ర గాయాలు



ఏరియా ప్రభుత్వాసుపత్రిలో సంచాన్ సింగ్‌కు ప్రథమ చికిత్స అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: కెమికల్ డ్రమ్ము కట్ చేస్తుండగా భారీ పేలుడు సంభవించి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ఎల్. అగ్రహారం గ్రామంలో శనివారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన సంచాన్ కుమార్ సింగ్ అనే వ్యక్తి తాడేపల్లిగూడెం మండలం ఎల్. అగ్రహారం గ్రామంలోని నాగిరెడ్డి పాత ఇనుప సామాను గోడౌన్‌లో పనిచేస్తున్నాడు. రోజు వారీ పనిలో భాగంగా కెమికల్ డ్రమ్మును కట్ చేస్తుండగా ఒక్కసారిగా డ్రమ్ము తెరుచుకుని సంచాన్ కుమార్ సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతనిని తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం (టీటీసీ): అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ టి.లక్ష్మీసరస్వతి విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ సహాయకురాళ్ల పోస్టులకు సంబంధించి 10వ వార్డు–1 ఎస్టీ కేటగిరి, 16వ వార్డు–3లో బీసీ–డి, 18వ వార్డు–1లో ఓపెన్ కేటగిరి, అదే విధంగా 18వ వార్డు–4లో ఓసీ, ఇడబ్ల్యూస్ అంతేగాక రూరల్ మండలం కొమ్ముగూడెం–1లో బీసీ–సీ కేటగిరిలకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను మార్చి1వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ప్రత్తిపాడు పంచాయతీ ఆఫీస్ కాంపౌండ్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో అందజేయాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఇరగవరం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు, అధికారులు

ఇరగవరం: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఇరగవరం ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అన్నారు. శనివారం ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం పెద్ద ఎత్తున జరుగుతుందని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, నిర్మాణలు దాదాపుగా అన్ని గ్రామాల్లో పూర్తి చేశామన్నారు. మండలంలోని 21 గ్రామాల్లో సుమారు రూ.14 కోట్లతో ఆర్ అండ్ బీ, సీసీ, పంచాయతీ రోడ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. ఇరగవరం మెయిన్ రోడ్, రేలంగి శివారు గవర్ల పాలెం నుంచి ఈడూరు వరకు నిర్మించే రోడ్లు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి తెలిపారు. కె ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లి రెడ్డి నాగార్జున మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె పద్మ జ్యోతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల పరిషత్ అధికారి మూర్తి, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానవుని ఆలోచనలే పరిశోధనకు దోహదం



సాయిసతీష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: మానవుని మంచి ఆలోచనలే పరిశోధకునిగా మారుస్తాయని ఇండియన్ సర్వర్ సీఈఓ ఎం.సాయిసతీష్ చెప్పారు. శనివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్ఫూర్తి 2కే–24 జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియంలో ఆయన మాట్లాడారు. ఇంజినీర్‌లోని వినూత్న ఆలోచనలే సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం అవుతాయన్నారు. ప్రపంచమంతా ప్లాస్టిక్ వినియోగంలో ఉన్నా మనదేశంలో మాత్రం ప్లాస్టిక్‌ను ఉపయోగించి రోడ్ల నిర్మాణం చేపట్టడంలో ప్రపంచంలో నెంబర్ వన్ స్థాయిలో విజయం సాధించిందని సాయి సతీష్ చెప్పారు. ఇన్నోవేషన్‌తో అద్భుత ఫలితాలు సాధించవచ్చునన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ప్రపంచానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలంటే సివిల్ మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి అన్ని విభాగాలుంటేనే సాధ్యమవుతుందన్నారు. సీఎస్సీ హెడ్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు సింపోజియం ఒక వేదికగా నిలుస్తుందన్నారు. అనంతరం ఘనంగా సాయి సతీష్‌ను సత్కరించారు.

మట్టపర్రులో వాలీబాల్ కోర్టు ప్రారంభం



మట్టపర్రులో వాలీబాల్ క్రీడాకారులతో గ్రామ కమిటీ అధ్యక్షుడు కొల్లాబత్తుల రవికుమార్

పోడూరు: మట్టపర్రు ఆదిఆంధ్ర పేటలో స్థానిక యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును శనివారం వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షులు కొల్లాబత్తుల రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందడంతో పాటు యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఉంటారన్నారు. స్నేహభావం పెంపొందుతుందన్నారు. వాలీబాల్ కోర్టు కోసం వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి దాదాపుగా రూ.15వేల విలువైన ఇసుకను అందజే యడం పట్ల రవికుమార్, యూత్ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కుసుమె సుభాకర్, నేలపాటి రత్నంరాజు, వేడంగి జగదీష్, వేడంగి సురేష్, కలిగితి హరి, నల్లిమిల్లి స్వామి, బండి నాగశంకర్, ఉన్నమట్ల సతీష్, కుసుమె కిరణ్, నేలపాటి చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అతిరుద్ర మహాయాగం



కవిటంలో అతిరుద్ర మహాయాగ పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

పోడూరు: కవిటం గ్రామంలో 14 రోజులపాటు నిర్వహించిన శ్రీ సహస్ర చండీ సహిత మహా సౌర పూర్వక చతుర్వేద స్వాహాకార సహిత దశమహా విద్యాపూర్వక అతిరుద్ర మహాయాగ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు అతిరుద్ర యాగ పూర్ణాహుతిని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆధ్యాత్మిక వేత్త జంధ్యాల శ్రీనివాసశర్మ(నెలమూరు శర్మ), కవిటం సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, మేడపాటి రామచంద్రారెడ్డి, మేడపాటి రామారెడ్డి, పడాల వెంకట సత్యనారాయణరెడ్డి, బాలాజీరెడ్డి, గుడిమెట్ల రామ కనకారెడ్డి, కర్రి గంగాధరరెడ్డి తదితరులు యాగ నిర్వహణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎంఈవో శ్రీనివాస్‌పై డీవైఈవో విచారణ

పెంటపాడు: మండలంలోని జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు శనివారం పెంటపాడు ఎంఈవో–1పై డీవైఈవో రవీంద్ర భారతి విచారణ నిర్వహించారు. ప్రభుత్వం అందించిన నాడు- నేడు నిధుల దుర్వినియోగంతో పాటు, పాఠశాలల్లో విద్యార్థుల శాతం సరిపడగా ఉన్నా రోల్ శాతం తక్కువ చూపి డిప్యూటేషన్ కోరిన వారి అనుమతి లేకుండా బదిలీలకు సిఫార్సు చేయడం, ప్రజాప్రతినిధులపై దుర్భాషలు, పలువురు ఉపాధ్యాయులపై వేధింపులు, విద్యాశాఖ నుంచి పుస్తకాలు స్కూల్‌కు పంపేందుకు దాతల ద్వారా ట్రాన్స్‌పోర్టు చార్జీలు వసూలు చేయడం, తదితర ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. జెడ్పీటీసీ ఉప్పులూరి వరలక్ష్మి చేసిన ఆరోపణలపై వివరణ తీసుకున్నారు. ఎంపీపీ దాసరి హైమావతి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, జట్లపాలెం ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి సమక్షంలో లిఖితపూర్వకంగా ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో డీవైఈవో సంతకాలు తీసుకున్నారు. పూర్తి సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి శనివారం భీమవరానికి చెందిన అడ్డాల రంగారావు రావు కుమారుడు అడ్డాల నాని దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొప్పేశ్వరరావు దాతలకు అమ్మవారి ఆశ్వీర్వాచనం అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు ముత్యాల రామారావు, చెల్లంకి శేషగిరి, తాళ్లపూడి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.